సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 10 । నవంబర్ । 2023



ఆలయ భూముల పరిశీలన

కబ్జాకు గురైన నీలకంఠేశ్వర ఆలయ భూములను దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ గురువారం పరిశీలించారు.

- IIలో ▸



పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సెక్టార్ అధికారులు పరిశీలిస్తున్నారు. నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /21.9

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మబ్బుపట్టి ఉండవచ్చు. శీతల గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కాసుల బాలరాజ్‌కు వీహెచ్ పరామర్శ



ఖలీల్‌వాడి : బాన్సువాడ శాసనసభకు కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నం చేసిన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు కాసుల బాలరాజ్ ప్రస్తుతం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు. వి హనుమంతరావు చికిత్స పొందుతున్న కాసుల బాలరాజుని పరామర్శించారు. ఆత్మహత్యాయత్నం చేయడం సరికాదని, ఈసారి టికెట్ రాకుంటే మరోసారి అవకాశం ఉంటుందని,పదవులు శాశ్వతం కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రమోద్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు దీపావళి సెలవులు

సుభాష్‌నగర్ : దీపావళి సందర్భంగా ఈ నెల 10 నుంచి 15వ తేదీవరకు నగరంలో నిశ్రద్ధానంద్ గంజ్ మార్కెట్ యార్డు బంద్ నిర్వహిస్తున్నట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్చంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఆ రోజుల్లో ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించబోమన్నారు. కావున రైతులు మార్కెట్ యార్డుకు సరుకు తీసుకురావొద్దని విజ్ఞప్తి చేశారు. తిరిగి 16వ తేదీ నుంచి యార్డ్ తెరుచుకుంటుందన్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత



ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అర్బన్, రూరల్ నామినేషన్ కేంద్రంవద్ద గురువారం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి అర్బన్‌లో పోటీ చేసేందుకు షబ్బీర్‌అలీ, రూరల్ అభ్యర్థి భూపతి రెడ్డి వచ్చారు. అదే సమయంలో రూరల్ నుంచి పోటీ చేసేందుకు బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కూడా ర్యాలీగా వచ్చారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గాలు పోటాపోటీగా నినాదాలు చేశాయి. ఉద్రిక్తత పెరిగే అవకాశం ఉండడంతో స్పందించిన పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు.

మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, వేదికపై ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు కేశవరావు, బీబీ పాటిల్





బంగారు తునకజేస్త

"ఈ గడ్డతో నాకు పుట్టుకతోనే బంధమున్నది. బీబీపేట మండలంలోని కోనాపూర్(పోసానిపల్లె)లో మా అమ్మ పుట్టింది. ఆ ర్గొండలో మేనమామలు ఉంటుండె. చిన్నతనంలో వచ్చినపు డు పట్వాల దగ్గర బాదల్‌చంద్ ఇంట్లో ఉండెటోళ్లం. గంజి అడ్తిల నిమ్మల జీవారెడ్డి దగ్గ రా ఉండెటోళ్లం. తెలంగాణ ఉద్యమం మొదలు పెట్టినపుడు కామారెడ్డి కోర్టులో వకీళ్లు మా బావ రామారావు, మిత్రుడు తిర్మల్‌రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి బార్ అసోసియేషన్ తెలంగాణ కోసం తొలి తీర్మానం చేసి ఉద్యమానికి ఊపునిచ్చింది. జలసాధన ఉద్యమంలో మండలానికొకరు బ్రిగేడియర్‌గా ఉండే.. నేను కామారెడ్డి మండల బ్రిగేడియర్‌గా పనిజేసిన. సభల కోసం గులాబీ కూలీ పనిచేస్తున్నపుడు నేను దేశాయి బీడీ కంపెనీల పనిచేసిన. ఉద్యమంలో కామారెడ్డి అగ్రభాగాన నిలిచింది" – కామారెడ్డి సభలో సీఎం కేసీఆర్

- ఈ ప్రాంతంతో నాది పేగుబంధం
- నా వెనకాలే నీళ్లొస్తయి, నిధులొస్తయి
- ఐటీ, పరిశ్రమలు, విద్యాసంస్థలు కూడా..
- చూస్తుండగానే ఊహకందని అభివృద్ధి జరుగుతది
- కామారెడ్డి సభలో సీఎం కేసీఆర్
- గులాబీ శ్రేణుల్లో జోష్ నింపిన అధినేత ప్రసంగం

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి బంగారు తునకలెక్క జేస్తనని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కామారెడ్డి నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేసీఆర్ గురువారం తన నామినేషన్ పత్రాలను ఆర్డీవో కార్యాలయంలో సమర్పించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. "కామారెడ్డికి హైవే, రైల్వేలైన్ ఉన్నయి. ఇక్కడ అభివృద్ధి జరగడానికి ఎంతో ఆస్కారం ఉంది. అందుకు కావలసిన ప్రణాళిక నా దగ్గర ఉన్నది. చూస్తుండగానే ఊహకందనంత అభివృద్ధి సాధిస్తాం" అని సీఎం పేర్కొన్నారు. పట్టణంతో పాటు పల్లెల రూపురేఖలన్నీ మారిపోతయన్నారు.

కేసీఆర్ వెనకాలే..

"కామారెడ్డిలో కేసీఆర్ పోటీ చేయడానికి వస్తుండంటే ఒక్కడే వస్తడా, వెనకాల నీళ్లొస్తయి, నిధులొస్తయి, ఇంకా ఎన్నో వస్తయి. కామారెడ్డి రూపురేఖలే మారిపోతయ్" అని గులాబీ దళపతి పేర్కొన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను ఆఘమేఘాల మీద ఏడాదిన్నరలో పూర్తి చేసి కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు సాగునీరందిస్తామన్నారు. కామారెడ్డిలో ఐటీ సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఐటీతో ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పరిశ్రమలు రావడంతో ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు దొరుకుతాయన్నారు. విద్యాసంస్థలు కూడా వస్తాయని, వాటితో విద్యారంగంలో మరింత ముందుకు వెళతామన్నారు.

'గంప' భవిష్యత్తు నేజూస్కుంట..

గంప గోవర్ధన్‌తోపాటు ఉమ్మడి జిల్లా నాయకులు అడగడంతోనే కామారెడ్డినుంచి పోటీ చేస్తున్నానని కేసీఆర్ పేర్కొన్నారు. తనను కామారెడ్డిలో నిలబడాలని చొరవ తీసుకుని అడిగి, తన పదవిని త్యాగం చేసిన గంప గోవర్ధన్ భవిష్యత్తుకు ఏ ఇబ్బందీ ఉండదన్నారు. ఆయనను మరింత ఎత్తుకు పెంచే బాధ్యత తనదన్నారు. అప్పట్లో గంప గోవర్ధన్‌ను గెలిపిస్తే కామారెడ్డిని జిల్లా చేస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకున్నానని, మెడికల్ కాలేజీ ఇచ్చానని గుర్తు చేశారు.

ప్రజల్లో చర్చ పెట్టాలె....

దళితులు తరతరాలుగా అణచివేత, దోపిడీకి గురయ్యారని, వారిని ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని కేసీఆర్ పేర్కొన్నారు. వారి ఉన్నతి కోసం తాను దళితబంధు తీసుకువచ్చి అమలు చేశానన్నారు. దీనిపై ఊరూరా చర్చ జరగాలన్నారు. "రైతుబంధు, 24 గంటల కరెంటు ఇచ్చి కడుపుల పెట్టుకునే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కావాలా? మూడు గంటల కరెంటు ఇస్తామని, ధరణిని తీసేస్తామని చెబుతున్న కాంగ్రెస్ కావాలా?" అన్న అంశంపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజల్లో చర్చ పెట్టాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. "తెలంగాణ రాకముందే వ్యవసాయం ఎట్లుండె? కాలిపోయే మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లతో రైతులు పడ్డ గోసలు మరిచిపోయి వాళ్లకు ఓటేద్దామా" అన్న దానిపై చర్చించాలన్నారు.

సభలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు కేశవరావ్, బీబీపాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యే సింధే, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, నాయకులు కొమ్ముల తిర్మల్‌రెడ్డి, ఎల్.నర్సింగ్‌రావు, తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, నిట్టు వేణుగోపాల్‌రావ్, కాసాని జ్ఞానేశ్వర్, అయాచితం శ్రీధర్, బొంతు రామ్మోహన్, భానుప్రసాద్, ఆంజనేయులు, వకీల్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



సుభాష్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం

గులాబీ కండువా కప్పుకున్న సుభాష్‌రెడ్డి

బీబీపేట మండలం జనగామకు చెందిన సామాజిక సేవకుడు తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్ కూడా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు.

కేసీఆర్ పర్యటన ఇలా..

- సీఎం కేసీఆర్ గురువారం ఉదయం 11.57 గంటలకు ఎస్పీ కార్యాలయం వద్దనున్న హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- ఎస్పీ కార్యాలయం నుంచి 11.59 గంటలకు ప్రత్యేక బస్సులో ప్రభుత్వ విప్ గంప ఇంటికి బయలుదేరారు.
- మధ్యాహ్నం 12.06 గంటలకు గంప ఇంటికి చేరుకుని ముఖ్య నాయకులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.
- 1.59 గంటలకు ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. 2 గంటలకు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి దాఖలు చేశారు.
- 2.22 గంటలకు ఆర్డీవో కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. అక్కడి నుంచి మళ్లీ



కేసీఆర్‌ను ఇంట్లోకి ఆహ్వానిస్తున్న 'గంప' సతీమణి

ప్రభుత్వ విప్ ఇంటికి బయలుదేరారు.
- 3.16 గంటలకు డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుని, ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు.
- 3.22 గంటలకు కేసీఆర్ ప్రసంగాన్ని ప్రారంభించి, 3.59 గంటలకు ముగించారు.
- 04.04 గంటలకు ప్రత్యేక బస్సులో ఎస్పీ కార్యాలయం వద్దనున్న హెలీప్యాడ్‌కు బయలుదేరారు. అక్కడినుంచి హెలీకాప్టర్‌లో హైదరాబాద్ పయనమయ్యారు. – కామారెడ్డి టౌన్



సభలో పాల్గొన్న ప్రజలు

కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా!?

- బీజేపీ, కాంగ్రెస్ మాయలో పడొద్దు
- మరింత అభివృద్ధి కోసం జీవన్‌రెడ్డినే గెలిపించాలి
- నామినేషన్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆర్మూర్ : వ్యవసాయరంగానికి మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్ కావాలో..24 గంటల పాటు విద్యుత్ ఇస్తున్న బీఆర్‌ఎస్ కావాలో ప్రజలే తేల్చుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత మూడో పర్యాయం జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒంటరిగానే పోటీలో నిలిచిందన్నారు. కేసీఆర్ అనే సింహం సింగిల్ గానే వస్తున్నాడన్నారు. బక్కపలచని సీఎం కేసీఆర్‌ను గద్దెదించడం కోసం అన్ని పార్టీలు ఏకమై మందగా వస్తున్నారని ఎద్దేవా చేశారు. కర్ణాటక నుంచి కాంగ్రెస్ పార్టీ, గుజరాత్ నుంచి బీజేపీ పంచి పెట్టే డబ్బుల మాయలో పడొద్దని కోరారు. కారు ఉండగా బేకారు కావద్దంటూ పాలిచ్చే గేదెను అమ్మి కడుపులో పొడిచే దున్న పోతును కొనుక్కుందామా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను గద్దె దింపడం కోసం మోడీ, అమిత్‌షా, పదిహేను మంది సీఎంలు, 20 మంది కేంద్రమంత్రులు, యోగి, ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వస్తున్నారన్నారు.

తెలంగాణ కోసం ప్రశ్నించే కేసీఆర్ అనే ఏకైక గొంతు కోసేందుకు గోతులు తొవ్వుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి 11సార్లు అవకాశమిస్తే 55ఏళ్ల రాష్ట్రాన్ని పాలించి కరెంటు, సాగు, తాగు నీళ్లివ్వకుండా అరిగోస పెట్టి ఇప్పుడు మళ్లీ ఒక్క చాన్స్ అంటూ రావడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో తెలంగాణ బతుకు చిత్రం మారుస్తుందని దీమా వ్యక్తం చేశారు. రూ. 16 వేలకు రైతుబంధు పెంపుతో వ్యవసాయం మరింత బలోపేతం కానుందన్నారు. సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు ప్రతినెల రూ. 3 వేల భృతి ఇవ్వనున్నామన్నారు. ఆసరా పెన్షన్లు రూ. 5 వేలకు పెంపుతో ప్రతి ఇంట్లో సంతోషం కనిపిస్తోందన్నారు. అర్హులైన వారందరికీ రూ. 400 కే సిలిండర్ అందజేస్తామన్నారు. బీసీల పథకాలు, దళితబంధు పథ కం ఎప్పటిలాగే కొనసాగుతాయన్నారు. జీవన్‌రెడ్డికి హ్యాట్రిక్ విజయం కట్టబెట్టడానికి కారు గుర్తుకే ఓ టేయాలన్నారు. మీ కుటుంబ సభ్యుడిలా ఉన్న జీవన్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం కోసం కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు డాక్టర్ మధుశేఖర్, జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి, రాజారాం యాదవ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ఎవరు?

- ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్‌నాగారం : కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు కొట్లాటలేనని, ప్రజల గురించి ఆలోచించే సమయం వారికి లేదని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ సీఎం అభ్యర్థి కేసీఆర్ అని, మరి కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ఎవరని ఆమె ప్రశ్నించారు. గురువారం నగరంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రసంగించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, అహాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. బీజేపీ అదే దారిలో వెళ్తోందన్నారు. ఓయూ విద్యార్థులను అడ్డ మీది కూలీలన్నారన్నారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల, మేయర్ నీతూకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టేక్ కేర్ రామన్న..

ట్విట్టర్‌లో ఎమ్మెల్సీ కవిత పోస్ట్



ఆర్మూర్‌లో గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న కేటీఆర్ ప్రచార రథం రెయిలింగ్ విరగగా కిందికి జారిపోయారు. దీంతో కేటీఆర్ ఆరోగ్య పరిస్థితిపై తాను వాకబు చేశానని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ప్రచారంలో జాగ్రత్తగా ఉండాలని..రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. టేక్‌కేర్ రామన్నా.. అంటూ సంబోధించారు.

అటు.. ఇటు..

నామినేషన్ల పర్వం ఆఖరు రోజుకు చేరింది. ఈ క్రమంలో ఇప్పటికే ప్రచారాన్ని ఉధృతం చేసిన ప్రధాన పార్టీలు చేరికలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. గ్రామ, మండల స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేసే నాయకులతో పాటు సాధారణ సభ్యత్వాలు ఇచ్చి పలువురిని చేర్చుకుంటున్నారు. తద్వారా తమ బలం పెరుగుతోందని చూపించే ప్రయత్నంలో పడ్డారు.

రోజుకో పార్టీ.. పూటకో కండువా

- చేరికలను ప్రోత్సహించేందుకు అభ్యర్థుల తాపత్రయం
- స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల కోసం ఆపరేషన్లు
- అభ్యర్థుల ఒత్తిడితో రాత్రికి రాత్రే పార్టీలు మారుతున్న నాయకులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అసెంబ్లీకి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులుస్థానికంగా ఉన్న పరిస్థితులను బట్టి ఓటర్లను ప్రభావితం చేయగలిగిన నాయకులకు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నగదు ప్యాకేజీలు ఇచ్చి మరీ చేర్చుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు ఈ చేరికల పర్వాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఒక పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేసిన సీనియర్లను చేర్చుకుని ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిపై మానసికంగా పైచేయి సాధించే లక్ష్యంతో తగిన విధంగా ముందుకు వెళ్తున్నారు. అందుకు అనుగుణంగా వ్యూహాలు తయారు చేసుకుని వాటిని అమలు చేస్తున్నారు. వివిధ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గంపగుత్తగా చేర్చుకునేందుకు కూడా ఆయా పార్టీలు స్కెచ్ వేసుకుని మరీ ముందుకెళ్తున్నాయి.

బంగారం.. నగదు..

స్థానిక ప్రజాప్రతినిధులకు వాళ్లస్థాయిని బట్టి కొందరు అభ్యర్థులు బంగారం, నగదు ఇచ్చి మరీ మచ్చిక చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక పార్టీలో చేరిన స్థానిక ప్రజాప్రతినిధులు మరుసటి రోజు మరో పార్టీలోకి వెళ్లిన ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. కొందరు అభ్యర్థులైతే తమ పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు వేరే పార్టీలోకి వెళ్తే కొన్ని గంటలు గడవకముందే వాళ్లను తిరిగి తెచ్చుకుంటున్నారు. ఇలా పార్టీ వదిలి వెళ్లిన వారిని తిరిగి తెచ్చుకునేందుకే కొందరు అభ్యర్థులు ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్న సందర్భాలుండడం గమనార్హం. స్థానిక ప్రజాప్రతినిధులను తమ వైపు తిప్పుకునేందుకు ప్రత్యేకంగా ఆపరేషన్లు చేపడుతుండడం విశేషం. చేరికలు ఎన్ని చూపించుకుంటే ఓటర్ల పరంగా అంతగా తమకు కలిసి వస్తుందని అభ్యర్థులు భావిస్తుండడం విశేషం. కొన్ని మండలాల్లో అయితే కొన్ని పార్టీలకు సంబంధించి తమకు నచ్చిన అభ్యర్థికి టిక్కెట్టు వస్తేనే చేరేందుకు పలువురు గ్రూపులుగా మారి వేచిచూశారు. తాము అభిమానించే నాయకులకు టిక్కెట్లు వచ్చాకే ఆయా పార్టీల్లో చేరడం గమనార్హం. ఎన్ని చేరికలు ఉంటే అంత లాభం ఉంటుందని భావించిన ఆయా పార్టీల అభ్యర్థులు ఎత్తులు పైఎత్తులు వేసుకుని అమలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల బలవంతాలు, ఒత్తిళ్ల కారణంగా పలువురు నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు అన్నవిధంగా శిబిరాలు మారుతుండడం ఆసక్తి కలిగిస్తోంది.

నామినేషన్ల పర్వం..





రూరల్‌లో నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి



అర్బన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా..



ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డి..



బాల్కొండలో కాంగ్రెస్ అభ్యర్థి సునీల్ రెడ్డి..



బోధన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి..



బోధన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్, పక్కన ఎమ్మెల్సీ కవిత



బోధన్‌లో బీజేపీ అభ్యర్థి మోహన్ రెడ్డి, పక్కన ఎంపీ అర్వింద్

క్లుప్తంగా

మధ్యవర్తిత్వంతోనే కేసుల పరిష్కారం



తెయూ(డిచ్‌పల్లి): మధ్యవర్తిత్వంతోనే కోర్టు కేసుల పరిష్కారం సాధ్యమవుతుందని ఐఐఏఎం మీడియేటర్ కేఎస్‌శర్మ అన్నారు. తెయూ న్యాయశాస్త్ర కళాశాలలో 'కోర్టు కేసుల్లో మధ్యవర్తిత్వం–సవాళ్లు' అనే అంశంపై గురువారం నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌కు ఆయన హాజరై మాట్లాడారు. న్యాయస్థానాల్లో లిటిగేషన్ అనేది కాలాన్ని, మానవీయ సంబంధాలను దూరం చేస్తుందని అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన మంజీరా వెంకటేశ్ మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం ప్రధానంగా మానవ సంబంధాలను మెరుగుపరిచి మంచి సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ కె. ప్రసన్నరాణి, బీవోఎస్ చైర్మన్ జెట్లింగ్ ఎల్లోసా, అధ్యాపకులు బి.స్రవంతి, నాగజ్యోతి, రామలింగం, నర్సయ్య, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు తెయూ కబడ్డీ జట్టు



తెయూ(డిచ్‌పల్లి): ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం కాకినాడలో ఈ నెల 12 నుంచి నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు తెయూ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ (పురుషులు) జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ జి.బాలకిషన్ తెలిపారు. గురువారం కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. టోర్నమెంట్‌లో మంచి ప్రతిభ చూపి తెయూకి, రాష్ట్రానికి పేరు తేవాలని సూచించారు. జట్టుకు మేనేజర్‌గా వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, కోచ్‌గా ఎం.ప్రశాంత్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులు కాకినాడకు బయలుదేరి వెళ్లారు.

తెయూ కబడ్డీ జట్టు కోచ్‌గా మీసాల ప్రశాంత్

నిజామాబాద్‌నాగారం: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్ తెలంగాణ యూనివర్సిటీ మెన్స్ టీమ్ కోచ్‌గా నియమితులయ్యారు. సౌత్ జోన్ యూనివర్సిటీ క్రీడా పోటీలు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్నారు.

షబ్బీర్‌అలీతో కాంగ్రెస్ నేతల వాగ్వాదం

ఖలీల్‌వాడి: బాన్సువాడ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ కాసుల బాలరాజు అనుచరులు జిల్లా కేంద్రంలోని మారుతీనగర్‌లో ఉన్న షబ్బీర్‌అలీతో గురువారం వాగ్వాదపడ్డారు. బాలరాజుకు టికెట్ రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. షబ్బీర్‌అలీ వారిని సముదాయించి, ఈ అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శుక్రవారం రేవంత్‌రెడ్డిని కలిసి తగు న్యాయం చేస్తామని చెప్పానని ఇంతలో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు పలు అంశాలపై చర్చించారు.

ఫ్యామిలీ కోర్టు జడ్జి బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఫ్యామిలీ కోర్టు జడ్జి షౌకత్ జహన్ సిద్ధికి సికింద్రాబాద్ కోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో మహబూబ్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న చిరంజి ఆశలత అదనపు జిల్లాజడ్జిగా ఉద్యోగోన్నతిపై రానున్నారు. కామారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి బి.శ్రీదేవి పదోన్నతిపై హనుమకొండ అదనపు జిల్లాజడ్జిగా నియామకమయ్యారు.

ఆరో రోజు.. 33 నామినేషన్లు

- నేడు ఆఖరి రోజు
- ఇప్పటివరకు మొత్తం 70 నామినేషన్లు

సుభాష్‌నగర్/ ఆర్మూర్/ బోధన్‌టౌన్/ నవీపేట/ ఖలీల్‌వాడి: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురువారం 33 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. శుక్రవారంతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో రిటర్నింగ్ కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.

అభ్యర్థుల ప్రత్యేక పూజలు

ఆర్మూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. మొదట అంకాపూర్‌లోని తన నివాసంలో తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకొని, నవనాథసిద్ధుల గుట్టపై కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. పి వినయ్ కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), ఎస్‌కే మాజిద్ (మజ్లిస్ బచావో తెహ్రీక్), తాళ్లపల్లి శేఖరయ్య (విద్యార్థుల రాజకీయ పార్టీ), గండికోట రాజన్న (బీఎస్‌పీ) నామినేషన్లు సమర్పించారు.

- బోధన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పి సుదర్శన్‌రెడ్డి నవీపేట మండలంలోని సిరన్‌పల్లిలో ఉన్న తన నివాసంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. ర్యాలీగా వెళ్లి నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్ పట్టణంలోని రెంజల్ బేస్‌లో ఉన్న జలాల్ బుకారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. వి మోహన్‌రెడ్డి (బీజేపీ), మోసిన్ (ఎం–సీపీఐ), డి నాగరాజు (ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్), షేక్ జలీల్, సాయం మురళీ (స్వతంత్రులు)గా నామినేషన్లు దాఖలు చేశారు.
- బాన్సువాడ నుంచి పరిగె భాస్కర్ రెడ్డి (స్వతంత్ర), పందిరి గంగామణి (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలయ్యాయి.
- నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి మహ్మద్ షబ్బీర్ అలీ (కాంగ్రెస్), బి.లలిత (స్వతంత్ర), పడకంటి రాము (స్వతంత్ర), దత్తురామ్ ఖతల్ (రాష్ట్రీయ సమాజ్ పక్ష), దండి లత (బహుజన్ లెఫ్ట్ పార్టీ), బిగాల గణేశ్ (బీఆర్‌ఎస్), ఫజల్ కరీం (ఎన్సీపీ), మహేశ్ బిగాల (బీఆర్‌ఎస్), ఎం శివకుమార్ (సీపీఐఎంఎల్), ధన్‌పాల్ సూర్యనారాయణ (బీజేపీ), మహ్మద్ మన్సూర్ అలీ (అన్నా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ) అభ్యర్థులుగా నామినేషన్ పత్రాలు సమర్పించారు. సీపీఐఎంఎల్ అర్బన్ అభ్యర్థి శివకుమార్ సైకిల్‌పై వెళ్లి నామినేషన్ వేశారు.
- నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ నుంచి బాజిరెడ్డి గోవర్దన్ (బీఆర్‌ఎస్), బాజిరెడ్డి జగన్ మోహన్ (స్వతంత్ర), ఆర్ భూపతిరెడ్డి (కాంగ్రెస్), ఎం శేఖర్ (బీఎస్‌పీ) అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.
- బాల్కొండ నియోజకవర్గం నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి (బీఆర్‌ఎస్), పల్లికొండ నర్సయ్య (బహుజన సమాజ్ పార్టీ), ఎం భోజన్న (ధర్మ సమాజ్ పార్టీ), ముత్యాల సునీల్ కుమార్ (కాంగ్రెస్) అభ్యర్థులుగా నామినేషన్ వేశారు.

ఆరు నియోజకవర్గాల్లో..

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి 70 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆర్మూర్ సెగ్మెంట్ నుంచి 11 నామినేషన్లు, బోధన్‌లో 13, బాన్సువాడలో 8, నిజామాబాద్ అర్బన్‌లో 21, నిజామాబాద్ రూరల్‌లో 10, బాల్కొండ నియోజకవర్గంలో 7 నామినేషన్లు దాఖలయ్యాయి.



అంకాపూర్‌లో తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

బోధన్‌లో స్కూటీపై ఎమ్మెల్సీ కవిత

బోధన్‌టౌన్: బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే షకీల్ నామినేషన్ దాఖలు సందర్భంగా బోధన్‌కు వచ్చిన ఎమ్మెల్సీ కవిత అందరినీ ఆశ్చర్యపర్చేలా ఎమ్మెల్యే ఇంటికి స్కూటీపై వచ్చారు. బోధన్‌లో అధికంగా ట్రాఫిక్ ఉండడంతో పట్టణంలోని ఏఆర్ గార్డెన్ వద్ద కారు దిగిన కవిత స్కూటీపై ప్రజలకు విజయ కేతనం చూపుతూ ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ కవిత సాధారణ మహిళలా స్కూటీపై రావడం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసింది.



స్కూటీపై వెళ్తూ విజయ కేతనం చూపుతున్న ఎమ్మెల్సీ కవిత



నామినేషన్ వేసేందుకు సైకిల్‌పై వెళ్తున్న సీపీఐఎంఎల్ అభ్యర్థి



తల్లి, అమ్మమ్మ ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే బిగాల



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న బీఆర్‌ఎస్ బోధన్ అభ్యర్థి షకీల్



సిరన్‌పల్లిలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ బోధన్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా..?

- బూత్‌ల వారీగా పరిశీలన చేస్తున్న అధికారులు

మోర్తాడ్: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. ఇంకా కల్పించాల్సిన వసతులపై సెక్టార్ అధికారులు పరిశీలన చేపడుతున్నారు. నీరు, విద్యుత్, టాయ్‌లెట్స్, దివ్యాంగుల కోసం రోలింగ్ ఇతరత్రా సౌకర్యాలు ఉన్నాయా లేవా అని అధికారులు జీపీ కార్యదర్శులను అడిగి తెలుసుకుంటున్నారు. జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, అర్బన్, బోధన్ నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాల్లో అధికారులు స్వయంగా పరిశీలన చేపడుతున్నారు. జిల్లా మొత్తంలో 1,549 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటు వేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో సౌకర్యాల విషయంపై పరిశీలన చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 30న నిర్వహించే పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.



దొన్కల్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పోచారంలో బీజేపీ ప్రచార రథంపై దాడి

బాన్సువాడ: మండలంలోని పోచారం గ్రామంలో బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ ప్రచార రథం బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్వగ్రామమైన పోచారం గ్రామానికి చేరుకుంది. దీంతో గ్రామంలో ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు మా ఊరికి ఏ పార్టీ నాయకులు ప్రచారం చేయడానికి రావొద్దంటూ ప్రచార రథానికి ఉన్న ఫ్లెక్సీలను చింపివేశారు. ప్రచారం రథంపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేస్తుండగా తాము సెల్‌ఫోన్లలో వీడియో తీస్తుండగా వారు అడ్డుకొని ధ్వంసం చేసినట్లు ఆరోపించారు. దీంతో కొద్ది సేపు గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. రుద్రూర్‌లో ప్రచారంలో ఉన్న బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ పోచారం గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే గ్రామానికి వచ్చిన సీఐ మహేందర్‌రెడ్డి, ఎన్నికల అబ్జర్వర్‌లు పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నం చేశారు. బీజేపీ ప్రచార రథంపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేస్తున్న సమయంలో పోలీసు సిబ్బంది అక్కడే ఉన్నా పట్టించుకోలేదని వారిపై చర్యలు తీసుకోవాలని యెండల డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సాయిరెడ్డి, సాయిబాబా, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, అనిల్, హన్మాండ్లు, కొండని గంగారం తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న యెండల

కేఆర్ సురేశ్‌రెడ్డికి ప్రథమ చికిత్స



ఆర్మూర్: పట్టణంలో బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో ప్రచార రథంపై నుంచి పడ్డ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఆయనను పట్టణంలోని పెర్కిట్‌లో ఉన్న ఎంజే ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. కాలికి, చేతికి గాయాలు కావడంతో చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిపోయారు.

ఎన్నికల విధులు మినహాయించాలి



సుభాష్‌నగర్: దివ్యాంగ ఉద్యోగులకు ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలని జిల్లా దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. దివ్యాంగ ఉద్యోగులకు శారీరక, వినికిడి, అంధత్వం వంటి సమస్యలు ఉంటాయన్నారు. ఎన్నికల సామగ్రి రవాణా, విధుల నిర్వహణలో ఆటంకాలు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్ రాజు, ప్రధానకార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి బసవయ్య, వెంకటేశ్వర్లు, కుమార్ నాయక్, పండరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌పై పాకాల యువకుడి పోటీ



బానోతు రమేశ్

సిరికొండ: కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై పాకాలకు చెందిన బానోతు రమేశ్‌నాయక్ అనే నిరుద్యోగి పోటీ చేస్తున్నాడు. పీజీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న రమేశ్‌నాయక్ ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా నామినేషన్ వేస్తున్నట్లు తెలిపాడు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 20 మంది శుక్రవారం కామారెడ్డిలో నామినేషన్ వేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

నీలకంఠేశ్వర ఆలయ భూముల పరిశీలన

- 40 శాతం కబ్జాకు గురైనట్లు అధికారుల అంచనా
- కబ్జాదారులకు త్వరలో నోటీసులు
- ఏసీ సుప్రియ వెల్లడి

నిజామాబాద్ సిటీ: జిల్లాలోని నీలకంఠేశ్వర ఆలయ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన భూముల రక్షణపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్లక్ష్య వైఖరి వీడకపోవటం కబ్జాదారులకు కలిసివస్తోంది. దేవుని పేరిట ఉన్న భూములను కబ్జాదారులు తమ పేరిట డాక్యుమెంట్లు సృష్టించుకుని రిజిస్ట్రేషన్ చేసుకుంటూ అమాయక ప్రజలకు విక్రయిస్తుండడంతో ఆ స్థలాలు క్రమేణ కబ్జాలకు గురవుతున్నాయి. వర్నిరోడ్డులో ఉన్న నీలకంఠేశ్వర్ ఆలాయనికి చెందిన 2ఎకరాల34 గుంటల భూమి ఉంది. ఇందులో 40శాతం ఆలయ భూములు కబ్జాకు గురైనట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ గురువారం భూముల పరిశీలన అనంతరం అంచనా వేశారు. తాజాగా వర్నిరోడ్డులో సుమారు 200 గజాల స్థలం ప్రధానరోడ్డు పక్కన ఉండగా దీనిని కబ్జా చేసి నిర్మాణం చేపట్టారు. ఇది నీలకంఠేశ్వర ఆలయానికి చెందిన భూమి అని దేవాదాయ శాఖ అక్కడ బోర్డు పెట్టినా దానిని అక్రమార్కులు తొలగించి నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న దేవాదాయ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాన్ని వారే స్వయంగా కూల్చివేశారు. కబ్జాలకు పాల్పడిన ముగ్గురిపై 5వ టౌన్ పీఎస్‌లో అధికారులు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ స్థలం దేవాదాయ శాఖకు సంబంధించినదేనని కబ్జాకు పాల్పడినవారు పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ తెలిపారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని వర్నిరోడ్డులో ఉన్న ఆలయ భూములను ఏసీ సుప్రియ గురువారం దేవాదాయ పరిశీలకురాలు బి కమల, ఈవో వేణుతో కలిసి పరిశీలించారు.

సర్వేకు సహకరించని సర్వేయర్లు..

జిల్లాలో ఆలయాలకు చెందిన భూముల లెక్క తేల్చేందుకు గతంలో దేవాదాయ శాఖ రెవెన్యూ శాఖను సర్వే చేయాలని కోరింది. సర్వే పనులు కొన్ని ప్రాంతాల్లో 50శాతం పూర్తి చేసి వదిలిపెట్టారు. మిగతా 50శాతం సర్వే చేయాలని కోరినా సర్వేయర్లు సహకరించడంలేదని సంబంధిత శాఖ అధికారులు వాపోతున్నారు. ఆలయ భూములను సర్వే చేయాలని రెవెన్యూ శాఖను కోరినా వారు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు నిర్మాణాలు చేపడుతున్నారు.



వర్నిరోడ్డులో కబ్జా అయిన ఆలయ భూములను పరిశీలిస్తున్న అధికారులు

నోటీసులు జారీ చేస్తాం

వర్నిరోడ్డులో ఉన్న నీలకంఠేశ్వర ఆలయానికి వివిధ సర్వేనంబర్లలో రెండు ఎకరాల 34 గుంటల భూములు ఉన్నాయి. ఇందులో 40శాతం వరకు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది. ఈ భూములను కబ్జాలకు పాల్పడి ఇండ్లు నిర్మించుకున్న వారికి వారం రోజుల్లో నోటీసులు జారీ చేస్తాం. దేవుడు దొంగ డాక్యుమెంట్లు సృష్టించుకోడు మనుషులే సృష్టిస్తారు. ఈ ఫేక్ డాక్యుమెంట్లతో ఆలయ భూములు కబ్జాలకు గురైవుతున్నాయి. ఆలయ భూములను కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

–సుప్రియ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రామారెడ్డి: గ్రామంలోని వైన్స్ పర్మిట్ రూంలో ఒకరు అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. కామారెడ్డికి చెందిన వంకలవాడి సంజీవ్ (33) గ్రామంలోని వైన్స్ పర్మిట్ రూంలో తాగుతూ ఒక్కసారిగి కిందపడి మృతి చెందాడు. మృతుడి అన్న మారుతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్‌లో ఇస్లాంపురా కాలనీకి చెందిన హీనా బేగం కుమారుడు మహమ్మద్ అర్షన్ (20 నెలలు) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల అర్షన్ ఇంట్లో ఆడుకుంటూ బ్లీచింగ్ పౌడర్ తిన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. తల్లి హీనా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



సాయిలు (ఫైల్)

వర్ని(మోస్రా): మోస్రా మండల కేంద్రానికి చెందిన మేదరి సాయిలు(52) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ గురువారం తెలిపారు. సాయిలు మద్యం, పేకాటకు బానిస కావడంతో డబ్బుల విషయమై ఇంట్లో తరచూ గొడవలు జరిగేవని పేర్కొన్నారు. బుధవారం రాత్రి సైతం ఇంట్లో గొడవ జరగడంతో గదిలోకి వెళ్లిన సాయిలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలిన మృతదేహం లభ్యం

రుద్రూర్: కోటగిరి మండలం లింగమయ్య గుట్ట సమీపంలో పోతంగల్ మండలం జల్లాపల్లి ఆబాదికి చెందిన మహ్మద్ హుస్సేన్ (53) మృతదేహం లభ్యమైంది. మృతదేహం కాలిపోయి ఉన్నందున దుండగులు హత్య చేసి కాల్చివేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. జల్లాపల్లి ఆబాదికి చెందిన హుస్సేన్ కుటుంబ కలహాలతో రెండేళ్లుగా వర్నిలో ఉంటున్నాడు. ఈ నెల 8న హుస్సేన్ కనబడడం లేదని ఆయన కుమారుడు కమర్ హుస్సేన్ ఫిర్యాదు చేశాడు. గురువారం లింగమయ్య గుట్ట సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి విచారణ చేపట్టారు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పీఎస్ పరిధిలో తల్లీకూతుళ్లు అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ గురువారం తెలిపారు. అక్టోబర్ 29న కుటుంబసభ్యులందరు రాత్రి భోజనం చేసి పడుకున్నారు. ఉదయం గదిలో నిద్రించిన భార్య లలిత, కూతుళ్లు అక్షర, చైత్రలు కనిపించకపోవడంతో భర్త, కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే పోలీసులుకు సమాచారం అందించాలన్నారు.

ట్రాఫిక్ క్లియర్ చేసిన ఎస్పీ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు జనం అధికంగా రావడంతో రోడ్డుపై ట్రాఫిక్‌సమస్య ఏర్పడింది. ద్విచక్ర వాహనాలు, ప్రజలతో ఆ ప్రాంతం రద్దీగా ఏర్పడింది. సమస్యను గుర్తించిన ఎస్పీ సింధూశర్మ రంగంలోకి దిగి స్వయంగా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇది చూసిన పలువురు ఎస్పీని అభినందించారు.

సాక్షి ఫ్యామిలీ
ఫ్యాషన్
నిజామాబాద్
శుక్రవారం ॥ 10-11-2023





పట్టుబట్టలతోనే కాదు మనవైన సంప్రదాయ దుస్తులతోనూ వెలిగిపోవచ్చు.
మోడ్రన్ షేర్వాణీలను ధోతీ ప్యాంట్లతో మ్యాచ్ చేయచ్చు.
పర్యావరణ అనుకూలమైన డ్రెస్సులను ఎంచుకోవచ్చు.
పాత కాలం నాటి ప్రింట్లు, హ్యాండ్‌మేడ్ డిజైన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వచ్చు.
ఎవర్‌గ్రీన్ లుక్‌తో రాబోయే రోజులను
ప్రకాశవంతంగా మార్చడానికి ఈ దీపావళి నుంచే మొదలుపెట్టవచ్చు.
పండగ రోజున దీపాలనే కాదు
సరికొత్త ట్రెండ్‌తో వార్డ్ రోబ్‌లను కూడా వెలిగించవచ్చు.
ప్రతి వేడుకలోనూ మెరిసిపోవచ్చు.

వార్డ్ రోబ్‌లకూ వెలుగులు



నియో–సంప్రదాయం

పాతకాలం నాటి కుర్తాలు, షేర్వాణీలు ఇప్పుడు కొత్తగా రూపాంతరం చెందాయి. ఈ దీపావళికి ఇవి ఎంతో అందంగా ఉంటాయి. అలాగే, లేయర్డ్ షేర్వాణీలు, ధోతీ ప్యాంట్‌లను ధరించవచ్చు. వీటిని మోడర్న్ డిజైన్, ఓల్డ్ ట్రెడిషన్‌తో మిళితం చేయచ్చు. ఈ మిక్స్ అండ్ మ్యాచ్ వల్ల సొగసైన రూపాన్ని పొందవచ్చు. ఇక నియాన్ కలర్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిలో బ్లూ, రెడ్, గ్రీన్, ఎల్లో కలర్స్ చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ రంగుల నుండి కాంతివంతంగా కనిపిస్తాయి.

పర్యావరణ అనుకూలం

సరైన అవగాహనతో ఫ్యాషన్ పర్యావరణ అనుకూల బట్టల వైపు మొగ్గు చూపుతోంది. సేంద్రియ పత్తి, వెదురు, జనపనార బట్టలు స్థిరంగా ఉండటమే కాకుండా మట్టి సొబగులను కూడా వెదజల్లుతాయి. సురయ్యా, ఇతర ప్రముఖ బ్రాండ్‌లు ఈ ట్రెండ్‌లో ముందంజలో ఉన్నాయి,



పేస్టల్స్ పెరుగుదల

దీపావళి ప్రకాశవంతమైన రంగులకు పర్యాయపదంగా ఉన్నప్పటికీ, లావెండర్, మింట్, బేబీ పింక్ పేస్టెల్ కలర్స్ పండుగ కళను పెంచుతాయి. ఈ రంగులు ప్రశాంతతతోపాటు రిచ్‌నెస్‌ను కళ్లకు కడతాయి.

డిజిటల్ ప్రింట్లు సాంప్రదాయ మూలాంశాలు

సాంకేతికత మన జీవితంలోని ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తున్నప్పుడు ఫ్యాషన్‌ను మాత్రం ఎందుకు వదిలివేయాలి... అందుకే, లోటస్ లేదా పీకాక్ ఫెదర్స్‌తో కూడిన భారతీయ సంప్రదాయ మూలాంశాలను ప్రదర్శించే డిజిటల్ ప్రింట్లు గొప్పగా కనిపిస్తున్నాయి. ఈ ప్రింట్లు, డిజైన్లు సంప్రదాయానికి ఆధునిక టచ్‌ను అందిస్తున్నాయి.

పాతకాలపు డిజైన్ల పునరుద్ధరణ

బనారసీ సిల్క్స్, చికంకారి ఎంబ్రాయిడరీ, బంధని వంటి పాతకాలపు వస్త్రాల ఆకర్షణ మళ్లీ మళ్లీ ఆకట్టుకుంటుంది. డిజైనర్లు ఈ సంప్రదాయ వస్త్రాలను ఆధునిక దుస్తులలో డిజైన్ చేస్తున్నారు. మనదైన గొప్ప వారసత్వాన్ని దేశీయ కళాకారులు కాపాడుతున్నారు.

చేతితో తయారు చేసిన పాదరక్షలు

పాదరక్షల్లో మన దేశీయ హస్తకళా నైపుణ్యం తన దైన ముద్ర వేస్తోంది. జూతీలు, కొల్హాపురీ, ఎంబ్రాయిడరీ ఇతర అలంకారాలతో చేతితో తయారు చేసిన పాదరక్షలలో దేనిని ఎంపిక చేసుకున్నా పండగ కళ కనిపిస్తుంది. ఇవి కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా ఉండటమే కాకుండా, వేడుకలో ప్రత్యేకమైన టచ్‌ను అందిస్తాయి.





సమాజానికి మంచి ఆహారాన్నివ్వాలనుకుంది.
ఖాద్యమ్... పేరుతో తినదగిన ఆహారాన్నిస్తోంది.
'వరల్డ్ ఫుడ్ ఇండియా'లోనూ నిరూపించుకుంది.
దేశ రక్షణ కోసం కొండల్లో గుట్టల్లో డ్యూటీ చేసే
సైన్యానికి మంచి ఆహారాన్నిచ్చే బాధ్యత చేపట్టింది.
ఈ సందర్భంగా కట్టెకోల మాధవి విజయగాథ.

జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

రక్షణరంగంలో విధులు నిర్వర్తించే వారి ఆహారం ఎలా ఉండాలో నిర్దేశించడానికి డీఎఫ్ఆర్ఎల్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రమాణాల మేరకు ఆహారం తయారు చేయడానికి అనుమతి సాధించారు ఓ తెలుగు మహిళ. ఈ అనుమతి సాధించడానికి ముందు ఆమె ఆహారం మీద అంతులేని పరిశోధన చేశారు. భూమిలో నాటే గింజ నుంచి పంట దిగుబడి, దినుసులను ప్రాసెస్ చేయడం, వండి చల్లార్చి డబ్బాల్లో ప్యాక్ చేయడం వరకు ప్రతిదీ ఒక చేతి మీదుగా నడిచినప్పుడే నిర్దేశించిన ప్రమాణాలను పాటించగలమని నమ్ముతారామె. సేంద్రియ పంట, వంటను ఈ నెల న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో ప్రదర్శించి మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న కట్టెకోల మాధవి.

రైతులు విచిత్రంగా చూశారు!

మాది సూర్యాపేట. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు మొత్తం హైదరాబాద్‌లోనే. నిజానికి నా చదువుకి, నేనెంచుకున్న ఈ రంగానికి సంబంధమే లేదు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేసి కొంత కాలం టీచర్‌గా, ఆ తర్వాత బ్యాంకులో ఉద్యోగం చేశాను. మా వారు మైక్రో బయాలజీ చేసి హిమాలయ సంస్థలో ఉద్యోగం చేశారు. నెలలో ఇరవై రోజులు క్యాంపుల ఉద్యోగం ఆయనది. జీవితం ఇది కాదనిపించేది. మన జ్ఞానాన్ని సరిగ్గా ఒకదారిలో పెడితే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చనిపించింది. సొంతంగా ఏదో ఒకటి చేయాలనే నిర్ణయానికి 2009లో వచ్చాం. నాలుగేళ్లపాటు సమాజం అవసరాలేమిటి, అందుబాటులో ఉన్న వనరులేమిటి అని అధ్యయనం చేశాం. సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం తప్ప అన్నీ ఉన్నాయని తెలిసింది. మేము 2014లో గ్రామాలకు వెళ్లి రైతులతో కొర్రలు పండిస్తారా అని అడిగినప్పుడు మమ్మల్ని వెర్రివాళ్లను చూసినట్లు చూశారు. కుగ్రామాలకు వెళ్లి మహిళలకు మా ఉద్దేశాన్ని వివరించాం. విత్తనాల నుంచి పంటకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నీ మేమే ఇస్తాం, మీరు పండించిన పంటను మేమే కొంటాం... అని భరోసా ఇచ్చాం. దాంతోపాటు వారు పండించే కంది పంట మధ్య చాళ్లలో చిరుధాన్యాలను పండించమని సూచించాం. ఒక కందిపంట సమయంలో చిరుధాన్యాలు మూడు పంటలు వస్తాయి. తమకు నష్టం ఏమీ ఉండదనే నమ్మకంతోపాటు మామీద విశ్వాసం కలిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాల్లో మొత్తం 1350 మంది మహిళారైతులు మాతో కలిశారు. గ్రౌండ్ వర్క్ చేసిన తర్వాత 2018లో కంపెనీ ఖాద్యమ్‌ని రిజిస్టర్ చేశాం. ఖాద్యమ్ అనే సంస్కృత పదానికి అర్థం తినదగినది అని. పంట నుంచి మా ప్రయోగాలు వంటకు విస్తరించాయి.

వండి చల్లబరుస్తాం!

ఇడ్లీ, సాంబార్, చట్నీ వంటి ఆహార పదార్థాలు యంత్రాల్లోనే తయారవుతాయి. ఉడికిన వెంటనే మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతకు తీసుకువెళ్లడంతో వాటిలో ఉండే తేమ హరించుకుపోతుంది. ఇలా తయారైన ఆహారం ప్యాకెట్లలో తొమ్మిది నెలల పాటు నిల్వ ఉంటుంది. వేడినీటిలో ముంచితే ఐదు నిమిషాల్లో ఇడ్లీ మెత్తగా మారుతుంది, సాంబార్, చట్నీలు కూడా అంతే. మేము కనుగొన్న విజయవంతమైన ఫార్ములా ఇది. పోహా నుంచి స్పగెట్టీ, పాస్తా వరకు ఒక ఇంట్లో అన్ని తరాల వారూ ఇష్టపడే రుచులన్నింటినీ ఇలాగే చేస్తున్నాం. మొదట్లో రెడీ టూ కుక్ ఉత్పత్తుల మీద దృష్టి పెట్టాం. రోజూ వండి బాక్సు పట్టుకెళ్లడం కుదరని రోజుల్లో రెడీ టూ ఈట్ విధానాన్ని అనుసరించాం. ఆఫీస్‌కి టిఫిన్ బాక్స్ తేలిగ్గా తీసుకెళ్లడానికి, ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి మా ఉత్పత్తులు చాలా అనువుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే సైన్యం అవసరాలకు తగినట్లు ఆహారాన్ని తయారు చేయడం పెద్ద సవాల్ అనే చెప్పాలి. మైసూర్‌లో ఉన్న డీఎఫ్ఆర్ఎల్‌కి ఎన్నిసార్లు వెళ్లామో లెక్క పెట్టలేం. యాభైసార్లకు పైగా వెళ్లి ఉంటాం. విమాన టిక్కెట్ల ఖర్చే లక్షల్లో వచ్చింది. సైంటిస్టులు సూచించిన నియమావళి ప్రకారం తయారు చేయడం, శాంపుల్ తీసుకెళ్లి చూపించడం, వాళ్లు చెప్పిన సవరణలను రాసుకుని హైదరాబాద్ రావడం, మేడ్చల్ దగ్గర బండ మాదారంలో ఉన్న మా యూనిట్‌లో తయారు చేసి మళ్లీ పట్టుకెళ్లడం... ఇలా సాగింది. మా ప్రయోగాల గురించిన ప్రతి వివరాన్నీ నోట్స్ సమర్పించాం. జీవితంలో ఓ గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నాం, ఆ ప్రయాణంలో మేము లక్ష్యాన్ని చేరేలోపు ఉద్యోగంలో సంపాదించుకున్న డబ్బు రెండు కోట్లకు పైగా ఖర్చయిపోయింది. ఏ దశలోనూ వెనుకడుగు వేయకుండా దీక్షగా ముందుకెళ్లడమే ఈ రోజు విజేతగా నిలిపింది. ఏ- ఐడియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగానూ, మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తున్నాయి. మా ఉత్పత్తులు ఈ-కామర్స్ వేదికల మీద పన్నెండు దేశాలకు చేరుతున్నాయి. ఢిల్లీలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సు జరిగింది. అందులో స్టాల్ పెట్టమని ప్రభుత్వం నుంచి ఆహ్వానం రావడమే ఈ ప్రయత్నంలో మేము గెలిచామని చెప్పడానికి ఉదాహరణ'' అని వివరించారు ఖాద్యమ్ కో ఫౌండర్ మాధవి.

వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో...



డీఎఫ్ఆర్ఎల్... డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లాబొరేటరీ. కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో ఉన్న ఈ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో ఒక విభాగం. రక్షణ రంగంలో విధులు నిర్వర్తించే వారికి నిల్వ ఉండే ఆహారాన్ని సరఫరా చేస్తుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, గడ్డకట్టే మంచులో ఉండే ఆర్మీ క్యాంపుల్లో విధులు నిర్వర్తించేవారికి తాజా ఆహారాన్ని అందించడం కొన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. అలాంటి సమయాల్లో వారి ఆకలి తీర్చేది... ముందుగానే వండి, శీతలపరిచి డబ్బాల్లో నిల్వ చేసిన ఆహారమే. అలా నిల్వ చేసే ఆహారాన్ని తయారు చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఆహారం నెలల కొద్దీ నిల్వ ఉండాలి. అందులో పోషకాలు లోపించకూడదు.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

వెచ్చటి వెలుగుల్లో తియ్యటి ఘుమఘుమలు

ఇల్లంతా దీపాల సందడి, టపాసుల వెలుగుల్లో చిన్నాపెద్దల చిరునవ్వులతో ఒకటే హడావుడి. స్వీట్లు చేయడానికి ఓపిక, సమయం రెండూ ఉండవు. అయినా పండగపూట మనింట్లో తయారైన తీపి రుచే వేరు. అందుకే సులభంగా చేసుకోదగిన తీపి ఘుమఘుమలతో వచ్చేసింది మనందరి వంటిల్లు....

గుడ్ పారే



కావలసినవి: మైదా – రెండు కప్పులు; నెయ్యి – పావు కప్పు; పాలు – అరకప్పు; బెల్లం – కప్పు; శొంఠి పొడి – టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: మైదాపిండిలో నెయ్యివేసి కలపాలి ● తరువాత గోరువెచ్చని పాలుపోసి ముద్దలా కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిముద్దను రెండు భాగాలు చేయాలి ● ఒక్కో భాగాన్నీ మందపాటి చపాతీలా వత్తుకుని అంగుళం పరిమాణంలో ముక్కలు చేయాలి ● మిగతాపిండిని కూడా ఇదే విధంగా చేయాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నూనెలో ఈ ముక్కలను వేసి మీడియం మంట మీద వేయించాలి. రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారితే పారేలు రెడీ అయినట్లే, వెంటనే తీసేయాలి ● బెల్లాన్ని గిన్నెలో వేసి పావుకప్పు నీళ్లుపోసి స్టవ్ మీద పెట్టాలి. మీడియం మంట మీద బెల్లం కరిగి సిరప్‌లా తయారయ్యేంతవరకు మరిగించాలి ● అడుగు అంటకుండా తిప్పుతూనే ఉండాలి. సిరప్ తయారైన తరువాత శొంఠి పొడివేసి కలిపి దించేయాలి ● వేయించి పెట్టుకున్న పారేలను సిరప్‌లో వేసి కలుపుతూనే ఉండాలి. ఇలా కలుపుతూ ఉండగానే మిశ్రమం మొత్తం చల్లబడి గుడ్ పారేలు అతుక్కోకుండా విడివిడిగా వస్తాయి. ఇప్పుడు తీసి ప్లేటులో వేసి సర్వ్‌చేసుకోవాలి ● గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచితే నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.

కాజు పిస్తా రోల్స్



కావలసినవి: జీడిపప్పు – ఒకటిన్నర కప్పులు; పిస్తా పప్పు – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – ఒకటింబావు కప్పులు; గ్రీన్ ఫుడ్ కలర్ – ఐదు చుక్కలు; బటర్ – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – కప్పు; యాలకులపొడి – పావు టీస్పూను;

తయారీ: జీడిపప్పును దోరగా వేయించి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ అయిన తరువాత జల్లెడపట్టి పొడిని తీసుకోవాలి. ●బాణలిలో వెన్న వేసి వేడెక్కనివ్వాలి. కరిగిన బటర్‌లో కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. ● నిమిషం పాటు పాలను కలుపుతూ ఉండాలి. తరువాత జీడిపప్పు పొడి వేయాలి. ● సన్నని మంటమీద తిప్పుతూ ఐదునిమిషాలు వేయించాలి. తరువాత దించేసి చల్లారనివ్వాలి. ●చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని జీడిపప్పు మిశ్రమాన్ని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ● ఇప్పుడు పిస్తాపప్పుని దోరగా వేయించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని జల్లెడపట్టి మెత్తటి పొడిని తీసుకోవాలి. ● పిస్తా పొడిలో పంచదార పొడి, యాలకుల పొడి, ఫుడ్ కలర్ కొద్దిగా వేడి నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. ● ఇప్పుడు జీడిపప్పు ముద్దను రెండు ముద్దలుగా చేసి, ఒక్కో ముద్దను మందపాటి చపాతీలా వత్తుకుని, కాస్త వెడల్పుగా ఉండేలా ముక్కలు కోయాలి. ● పిస్తా ముద్దను చిన్న ఉండలుగా చేసి, వీటిని పొడవాటి రోల్స్‌లా చుట్టుకోవాలి. ● జీడిపప్పు ముక్కపైన పిస్తా రోల్‌ను పెట్టి, జీడిపప్పు ముక్కను రోల్ చేయాలి. ● పిండి ముద్దను మొత్తాన్ని ఇలా రోల్ చేసి, పైన కుంకుమ పువ్వు, సిల్వర్ పేపర్‌తో గార్నిష్ చేస్తే కాజుపిస్తా రోల్స్ రెడీ.

షీర్ పేరా

కావలసినవి: పంచదార – కప్పు; పాలపొడి – రెండు కప్పులు; బాదం పలుకులు – టేబుల్ స్పూను; జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను; కిస్‌మిస్ – టేబుల్ స్పూను; యాలకులు – నాలుగు; నెయ్యి – టేబుల్ స్పూను; గార్నిష్ కోసం.... పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను (పెద్దసైజువి).

తయారీ: డ్రైఫ్రూట్స్ పలుకులు సన్నగా పొడవుగా ఉండేలా తీసుకోవాలి ● మందపాటి బాణలిలో పంచదార, కప్పు నీళ్లుపోసి మంటమీద పెట్టాలి ● తీగపాకం వచ్చేంత వరకు మరిగించాలి ● తీగపాకం వచ్చినప్పుడు సన్నమంటమీద ఉంచాలి ● ఇప్పుడు పాలపొడిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి ● పాలపొడి దగ్గర పడేంత వరకు కలుపుతూనే ఉండాలి ● దగ్గర పడుతున్నప్పుడు బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, కిస్‌మిస్ ముక్కలను వేసి కలపాలి ● చివరిగా యాలకులను పొడిచేసి వేయాలి ● ప్లేటుకును నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి ● ప్లేటంతా సమంగా పరుచుకుని పైన కొద్దిగా పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి ● స్పూను పెట్టి పైన కూడా సమంగా వత్తుకుని ప్లేటుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కట్‌చేసి సర్వ్ చేసుకోవాలి.



చిరోటీ



కావలసినవి: మైదా – ఒకటింబావు కప్పులు; సూజీ రవ్వ – కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పంచదార – అరకప్పు; యాలకులు – మూడు; పిస్తా తురుము గార్నిష్‌కు సరిపడా.

పేస్టుకోసం: బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: కప్పు మైదా, సూజీరవ్వ, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నెయ్యిలో కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని వేసి వేయించాలి. ● రెండు నిమిషాల తరువాత నీళ్లు చల్లుకుంటూ పూరీ పిండిలా కలుపుకోవాలి. ● పిండి ముద్ద తయారయ్యాక దానిపై తడిబట్టని కప్పి రెండుగంటలు పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు పంచదార, యాలకులను మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ● కరిగించిన నెయ్యిని బియ్యప్పిండిలో వేసి, పేస్టులా కలిపి పెట్టుకోవాలి. ● రెండు గంటల తరువాత పిండి ముద్దను మరోసారి బాగా కలిపి దానిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. ● ఒక్కో ఉండను చపాతీలా వత్తుకోవాలి. ● మూడు చపాతీలు చేసిన తరువాత... ఒకదాని మీద ఒకటి పెట్టి పై చపాతీపైన టీస్పూను బియ్యప్పిండి పేస్టుని రాయాలి. తరువాత కొద్దిగా మైదాను చల్లాలి. ● ఇప్పుడు చపాతీని మడతలు వేయాలి. ఒక్కో మడతకు టీ స్పూను బియ్యప్పిండి పేస్టు, కొద్దిగా మైదాను చల్లుకుంటూ చపాతీ మొత్తాన్ని మడత వేయాలి. ● పూర్తయ్యాక చపాతీ రోల్స్‌ను అంగుళం ముక్కలుగా కట్ చేయాలి ● ఒక్కోముక్కను గుండ్రంగా చేసి పూరీలా వత్తుకోవాలి ● మరీ పలుచగా లేదా మరీ మందంగా కాకుండా ఒక మాదిరిగా వత్తుకుని మధ్యలో చిన్న రంధ్రం చేయాలి ● ఇప్పుడు ఈ చపాతీలను సలసల కాగుతోన్న నూనెలో వేసి మీడియం మంట మీద లేత బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయిస్తే చిరోటీ రెడీ ● చిరోటీలను ఒకదానిమీద ఒకటి పేర్చి, పైన పంచదార పొడి, పిస్తా తురుము చల్లి సర్వ్ చేసుకోవాలి.